జీవం వున్న దేవత

అజీజ్

"కెప్టెన్!"

"ఊఁ!"

"మనం భారతదేశంలో దించాల్సిన సరుకులన్నీ దించబడ్డాయి. మన ఓడను బూత్‌కు దూరంగా తీసికెళ్ళి నిలపమని హార్బర్ నించి ఆదేశాలొచ్చాయి. కాసేపట్లో కస్టమ్స్ ఆఫీసరులొచ్చి ఫైనల్ చెకప్ చేస్తారుట" చెప్పాడు స్టోర్ కీపర్ కెప్టెన్ ముందు సరుకుల తాలూకు ఫైలు పెడుతూ.

వాలుకుర్చీలో జారగిలబడి, కాళ్ళు టీపాయ్‌మీద చాపుకొని, సిగరెట్ కాలుస్తూ తీవ్రాలోచనల్లో మునిగి వున్న కెప్టెన్ లంబా కళ్ళు తెరిచి సాలోచనగా తలూపాడు. "ఆల్ రైట్! లంగరు ఎత్తమని చెప్పు సిబ్బందికి" అంటూ ఫైలందుకున్నాడు.

స్టోర్ ఉద్యోగి వెళ్ళిపోగానే ఫైలు పరిశీలనలో మునిగిపోయాడు కెప్టెన్. తాము భారతదేశానికి చేరవేసిన

సరుకులన్నీ క్షేమంగా చేరినట్టు విశాఖపట్నం హార్బర్ అధికార్లు సంతకం జేసి, సీలు వేసిన కాగితాలవి. తృప్తిగా తలూపి, సిగరెట్ ఆఖరి దమ్ము లాగి, ఆష్‌ట్రేలో నొక్కి లేచాడు లుంబా.

దక్షిణాఫ్రికాకు చెందిన రవాణా ఓడ అది. వివిధ దేశాల్లో సరుకులు దింపుతూ, ఎత్తుతూ ఆ రోజు ఉదయమే వచ్చింది విశాఖ రేవుకు. అంతవరకూ ప్రయాణ బడలిక తీర్చుకుంటూ తన కేబిన్‌లోనే వున్నాడు కెప్టెన్ లుంబా.

అతను దక్షిణాఫ్రికా నీగ్రో యువకుడే అయినా, పూర్తిగా నీగ్రో కాదు. కలర్ హెడ్! ఇప్పటికీ బ్రిటన్ పాలనలో వున్న దక్షిణాఫ్రికాలో యెంతోమంది తెల్లవారుకూడా నివసిస్తున్నారు. ఆ తెల్లవాళ్ళకూ, అక్కడి నీగ్రో యువతులకూ మధ్య జరిగే తాత్కాలిక సంపర్కాలవల్ల పుట్టిన వాళ్ళనే కలర్ హెడ్స్ అంటారు!

వాళ్ళ రంగు నీగ్రోల్లా పూర్తిగా నలుపూ కాక, తెల్లవారిలా తెలుపూ కాక నలుపులో ఇంత ఎరుపు రంగు కలిపినట్టు నిగనిగ మెరుస్తూ ఉంటుంది. కనుముక్కు తీరు కూడా నీగ్రోల్లా ఎబ్బెట్టుగా కాకుండా కాస్త నదురుగా ఉంటాయి.

ఆ సంకరజాతికి చెందిన ముప్పైయేళ్ళ యువకుడే కెప్టెన్ లుంబా! మంచి పొడవు. కసరత్తుతో ఉక్కుదుక్కలా తయారైన శరీరం! విశాలమైన ఛాతీ. కండలు తిరిగిన చేతులు. ఉంగరాలు తిరిగిన పొట్టి జుత్తు. తెల్లని మర్చంట్ నేవీ యూనిఫాంలో అతని చాక్లెట్ రంగు శరీరం కంటి కింపుగా ఉంటుంది.

కేబిన్‌లోంచి బైట అడుగుపెడుతూ రిస్టువాచీ చూసు

ఉన్నాడు. సాయంత్రం ఆరుగంటలు. అప్పటికే ఓడ లంగరు ఎత్తేశారు సిబ్బంది.

నడుస్తూనే వారికి ఆదేశాలిస్తున్నాడు కెప్టెన్ లుంబా. పది నిమిషాల్లో ఓడ బూత్ వదలి, హార్బర్ అధికార్లు సూచించిన ఖాళీ ప్రదేశంలో కెళ్ళి నిల్చుంది. రేలింగ్ ని సమీపించి, హార్బర్ వైపు చూశాడు లుంబా.

అదే సమయంలో చిన్న లాంచీ ఒకటి తమ ఓడవైపు బెలుదేరడం కనిపించిందతనికి. అందులో ఫైళ్ళు పట్టుకు కూర్చున్న వ్యక్తుల్ని చూడగానే సాలోచనగా తలూపాడు లుంబా. కస్టమ్స్ ఆఫీసర్లు!

లాంచీ నెమ్మదిగా ఓడను సమీపించగానే నీళ్ళలోకి నిచ్చెన వదలమని ఆదేశించాడు తన సిబ్బందికి. వెంటనే తాళ్ళతో చేసిన ఓ నిచ్చెన నీటిలో జారవెయ్యబడింది.

కస్టమ్స్ అధికారులు ఓడమీదికి రాగానే,"స్వాగతం! సుస్వాగతం!" అన్నాడు లుంబా చెయ్యి చాపుతూ.

"సారీ కెప్టెన్! మీ ఓడను చివరిసారి చెక్ చెయ్యడానికి వచ్చాం!" అన్నాడు ఓ ఆఫీసర్ అతనితో కరచాలనం చేస్తూ.

"నిరభ్యంతరంగా! ఈసారే కాదు, మరో పదిసార్లు వచ్చినా నాకెలాంటి అభ్యంతరం ఉండదు" అన్నాడు లుంబా నిండుగా నవ్వుతూ. నవ్వినపుడు అతని పలువరస తెల్లగా తళతళ మెరుస్తుంది.

కస్టమ్స్ ఆఫీసర్లు ఓడ నాలుగువైపులా వ్యాపించారు. సెర్చింగ్ ప్రారంభమైంది. చట్టం ఆమోదించని మత్తు మందులూ, వజ్రాలూ, వెండి బంగారాలూ, యితర స్మగ్లింగ్ సరుకులేవయినా ఓడలో దాచబడున్నాయేమోనని!

దాదాపు గంట గడుస్తోంది. సీనియర్ కస్టమ్స్ ఆఫీసర్ డెక్ మీద నిల్చుని కెప్టెన్ లుంబాతో కబుర్లు చెబుతూ అతని మొహాన్ని, కళ్ళనీ పరీక్షగా చూస్తున్నాడు. కస్టమ్స్ డ్యూటీలో ఫేస్ రీడింగ్ కూడా చాలా ప్రాధాన్యత వహిస్తుంది. ఎదటివారి మనసులో ఏముందో కళ్ళూ, మొహమూ యిట్టే చెప్పేస్తాయి.

అందుకే కస్టమ్స్ ఆఫీసర్లు వస్తువులతో బాటు మనుషుల మొహాలను కూడా చాలా పరీక్షగా చూస్తారు. గంట గడిచినా కెప్టెన్ లుంబా మొహంలో ఎలాంటి అనుమానాస్పద భావమూ కనిపించకపోవడంతో కస్టమ్స్ ఆఫీసర్ కు నమ్మకం కుదిరింది ఆ ఓడలో ఎలాంటి అనుచిత వస్తువూ లేదని.

అంతలో అతని సిబ్బంది కూడా తిరిగివచ్చి, క్లియరెన్స్ రిపోర్టు ఇచ్చారు.

"మాతో సహకరించినందుకు మెనీ థాంక్స్ కెప్టెన్! వస్తాం!" అన్నాడు కస్టమ్స్ ఆఫీసర్ లుంబాతో కరచాలనం చేస్తూ.

"మళ్ళీ వస్తారా?" అడిగాడు లుంబా ఆశ్చర్యం నటిస్తూ.

కస్టమ్స్ ఆఫీసర్ పెద్దగా నవ్వి, "నో, నో!" అంటూ నిచ్చెన దిగి, లాంచీలో కూర్చున్నాడు. అక్కడే నిల్చుని, హార్బర్ వైపు సాగిపోతున్న లాంచీని చూస్తూ చెయ్యి ఊపసాగాడు లుంబా. అది కనుమరుగవగానే లోలోపల నవ్వుకున్నాడు చిన్నగా!

భారతీయులు చాలా అమాయకులని విన్నాడు తను. అది అక్షరాలా నిజమని ఈనాడు తెలిసింది. తన ఓడలో నిక్షిప్తమై ఉన్న ఆ రహస్య కేబిన్ని అఖరికి వాళ్ళు

కనుక్కోలేక పోయారన్న మాట! పాపం! పూర్ ఆఫీసర్స్!!

అనుకుంటూ వెనుదిరిగి, తన కేబిన్ వైపు నడిచాడు. ఓడ సిబ్బంది తమతమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వాళ్ళను పట్టించుకోకుండా తన కేబిన్ లో కెళ్ళి, ఓ పేము కుర్చీలో చతికిలబడ్డాడు కెప్టెన్. కుర్చీ వెనక తల ఆనించి కళ్ళు మూసుకుంటూ నెమ్మదిగా పిల్చాడు "జోంజా!"

"ఎస్ సర్!" అంటూ కేబిన్ లోకి వచ్చిందో అందమైన యువతి.

"విస్కీ!" చెప్పాడు లుంబా, కళ్ళు తెరవకుండానే.

2

చెక్క బీరువా తెరిచి, ఆకుపచ్చరంగు విస్కీ బాటిల్, గ్లాసూతీసి, అతని ముందుంచిందా యువతి. కళ్ళు తెరిచి, నింపాదిగా బాటిల్ కార్క్ తీసి, గ్లాసులో పోసుకోకుండా నోటికి ఆనించాడు లుంబా.

నిమిషంలో ఖాళీ అయింది బాటిల్.

"ఇంకోటి!" అన్నాడు ఖాళీసీసా టీపాయ్ మీద పెడుతూ.

యువతి మరో బాటిల్ తీసి అతని ముంగుంచింది.

"వెళ్ళి జనరేటర్ స్టార్టు చెయ్యమని చెప్పు ఫోర్ మెన్ కు" అన్నాడు గ్లాసందుకుంటూ. యువతి వెళ్ళి పోగానే ఈసారి గ్లాసులో విస్కీ ఒంపుకొని, కొద్ది కొద్దిగా తాగసాగాడు. ఓడలో లైట్లు వెలిగాయి. గంటలోపల ఆ సీసా కూడా ఖాళీ అయింది. రిస్టువాచీ చూసుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలు!

"జోంజా!" పిల్చాడు గట్టిగా.

"ఎస్ సర్!" అంటూ వచ్చిందా యువతి.

"డిన్నర్ రూంలో భోజనం ఏర్పాటు చెయ్! నువ్వు డార్లింగ్ డ్రెస్‌లో సిద్ధంగా వుండక్కడ" ఆజ్ఞాపించాడు తల వెనక్కి వాలుస్తూ.

"ఎస్ సర్!" అంటూ వెళ్ళిపోయిందా యువతి.

చిన్నగా నవ్వుకున్నాడు లుంబా, ఆ యువతి అతని సేవకురాలేకాదు. ప్రియురాలూ, సెక్రటరీకూడా! ఐతే, యే సమయంలో యే విధులు నిర్వహించాలో ఆ యా సమయాల్లో యేయే దుస్తులు తొడుక్కోవాలో వారిమధ్య ఓ క్రమశిక్షణ పాటించబడుతోంది.

సేవకురాలి డ్యూటీ నిర్వహించేటప్పుడామె నీలిరంగు స్కర్టులో పదహారణాల సర్వెంట్‌లా వుంటుంది. ఆ సమయంలో ఆమెగానీ, అతనుగానీ పరస్పరం ఎలాంటి చనువునూ వ్యక్తం కానివ్వరు.

ప్రియురాలి విధులు నిర్వహించేటప్పుడామె కిష్టమైన యే దుస్తులైనా వేసుకోవచ్చు. అప్పుడు వారిమధ్య చనువుకు పట్టపగ్గాలుండవు. సెక్రటరీ డ్యూటీ సమయంలో మళ్ళీ పూర్తి గాంభీర్యం చోటుచేసుకుంటుంది వారిమధ్య.

లేచి అడుగులో అడుగువేసుకుంటూ కేబిన్ తలుపు వైపు నడిచాడు లుంబా. రెండు విస్కీ సీసాలు ఖాళీ చేసినా, అతని మొహంలోనూ, నడకలోనూ తాగినవాడి లక్షణాలేవీ కనిపించడంలేదు.

కేబిన్ దాటి డైనింగ్ రూంలో అడుగుపెట్టాడు. విశాలమైన టేబిల్‌మీద పాలమీగడలాంటి దుప్పటి పర్చి వుంది. వెళ్ళి తన కుర్చీలో కూర్చున్నాడు. అప్పుడు అడుగుపెట్టిందామె గదిలోకి. అంతక్రితం కనిపించిన

శోంజాకూ, ఈమెకూ భూమ్యాకాశాల తారతమ్యం కనిపిస్తోంది.

"వెల్‌కమ్ మై స్వీట్ హార్ట్!" అన్నాడు లుంబా ఆమె చెయ్యందుకుంటూ. ఆ చేతిని ముద్దాడి, తన పక్క సీటులో కూర్చోబెట్టుకున్నాడు. ఇద్దరు నీగ్రో బట్లరు భోజన పదార్థాలు తెచ్చి టేబిల్ మీద సర్దసాగారు. గంట పట్టింది వారి భోజనం పూర్తయ్యేసరికి.

తృప్తిగా సిగరెట్ అంటించి, బేరర్‌కు సైగ చేశాడు లుంబా. మరుక్షణం ఓ మూల వున్న టేప్ రికార్డర్ ఆన్ అయింది. ఇద్దరూ లేచారు. ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి, టేబిల్ కడంగా వున్న ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్ళాడు లుంబా.

టేప్ రికార్డర్లోంచి సన్నగా, శ్రావ్యంగా వినిపిస్తున్న వెస్టర్న్ మ్యూజిక్ కనుగుణంగా అడుగులు వేస్తూ డాన్స్ చెయ్యసాగారిద్దరూ. అరగంట తరవాత ఆమె పెదాలు చుంబించి, టేప్ రికార్డర్ ఆఫ్ చేస్తూ అన్నాడు సొమ్మ సిగా, "సెక్రటరీ!"

వెంటనే పక్క గదిలోకి నడిచింది జోంజా. రిస్టు వాచీ చూసుకున్నాడు. పదిగంటలు. ఆలోచిస్తూ తన కేబిన్‌లో కెళ్ళి పేముకుర్చీలో జారగిలబడ్డాడు. ఐదు నిమిషాల్లో వచ్చేసింది జోంజా. ఇప్పుడామె ఒంటిపై అంతకుముందున్న దుస్తులేవు. నీలిరంగు జీన్స్‌పాంటులో తెల్లని టీషర్టు టక్ చేసి, నోట్ బుక్, పెన్సిల్ పట్టుకుని, పదహారణాల పర్సనల్ సెక్రెటరీలా అవతారం మార్చింది.

"డిక్టేషన్ యేమీ లేదు, కేవలం ఆదేశాలు విను" అన్నాడు లుంబా.

"ఎస్ సర్!"

"సరిగ్గా పదకొండు గంటలకు మేము బైలుదేరబోతున్నాం! పని పూర్తికావడాని కెంత సేపవుతుందో చెప్పలేను.. అంతవరకూ నువ్వు ఓడను కంట్రోల్ చెయ్యాలి. కస్టమ్స్‌వారి ఫైనల్ చెకింగ్ అయిపోయింది. ఇక రారనుకుంటాను. ఒకవేళ హఠాత్తుగా వచ్చి, నా గురించి అడిగితే, నగరం చూట్టానికిప్పుడే వెళ్ళానని చెప్పు! అర్థమైందా?"

"అలాగే సర్!"

"వాళ్ళు ఫోంచేశారా?"

"కనుక్కోనా?"

"అవసరంలేదు. చేసే వుంటారు. నువ్వెళ్ళి, పడవల ఏర్పాటు చూడు. నేనే వెళ్ళి వాళ్ళను కలుసుకుంటాను."

"అలాగే సర్!" అంటూ బైటికి నడిచింది జోంజా.

కుర్చీలోంచి లేస్తున్న కెప్టెన్ దృష్టి అనుకోకుండా ఎదురుగా వేలాడుతున్న కేలండర్ మీద పడింది. తేదీ చూశాడు. 23 - 12 - 1961. సాలోచనగా తలూపుతూ కేబిన్‌లోంచి బైటికి నడిచి అనేక గదులూ, మలుపులూ తిరిగి ఓడ చిట్టచివరి కేబిన్‌లో అడుగు పెట్టాడు.

అందులో ఓడకు సంబంధించిన పాత సామానూ, చెడిపోయిన వస్తువులూ పేర్చి వున్నాయి. జాగ్రత్తగా లోపలినించి కేబిన్ తలుపు మూసేసి, స్విచ్ వత్తి లైటు వెలిగించాడు. ఓ గోడని సమీపించి, వేళ్ళతో చెక్క మీద టపటప చప్పుడు చేశాడు.

"నేను, లుంబాని!" అని చెప్పాడు.

చిన్న శబ్దంతో వెడల్పాటి చెక్క పక్కకి జరిగి, మనిషి వెళ్ళగలిగేంతటి ద్వారం యేర్పడింది గోడలో. నెమ్మదిగా లోన అడుగు పెట్టాడు లుంబా. చిన్న సైజు

కేబిన్ అది. లోపల గుడ్డిగా వెలుగుతోంది బల్బు. కేబిన్ మధ్య మంచం!

ఆ మంచంమీద నిశ్చలంగా కూర్చునున్నాడో నీగ్రో వృద్ధుడు. అతని కిరుపక్కలా భక్తిగా చేతులు కట్టుకొని నిల్చున్నారు నలుగురు నీగ్రో యువకులు.

వృద్ధుడి తలా, పిల్లి గడ్డం, అక్కడక్కడా మొలిచిన పొట్టి మీసాలూ, కనుబొమలతోసహా అన్నీ తెల్లగా పండివున్నాయి. అతన్ని చూడగానే భక్తి ప్రపత్తులతో మోకరిల్లి "గురుదేవులకు వందనాలు" అన్నాడు కెప్టెన్ తలవంచుతూ.

"వెయ్యేళ్ళు వర్ధిల్లు నాయనా! మన జాతికోసం నువ్వు చేసిన పని చిరస్మరణీయమవుగాక!" అన్నాడు వృద్ధుడు దీవిస్తూ.

"మీరంతా భోంచేశారా?" అడిగాడు లుంబా లేచి నిల్చుంటూ.

తలూపారు యువకులు.

"ఇక బైలుదేరదామా?"

"అందుకోసమే యెదురుచూస్తున్నాను నాయనా!" అన్నాడు వృద్ధుడు ఓపిక నశించినట్టు.

"పదండి" అన్నాడు కెప్టెన్ వెనుదిరుగుతూ.

3

యువకుల చొక్కాలు బాగా మాసివున్నాయి. పాంట్లు పిక్కలవరకూ పైకిమడిచి వున్నాయి. వృద్ధుడి ఒంటిమీద కేవలం ఓ అంగుళీయం మాత్రమే చుట్టివుంది. బౌద్ధ సన్యాసిలా, చేతిలో చిఱుత చర్మంతో చేసిన చిన్న సంచి.

ఒకరి వెనక ఒకరు ముందు గదిలో అడుగు పెట్టారు.

కెప్టెన్ గోడలోని తలుపును యథాప్రకారం చెక్కతో మూసేసి, లైటార్పి, నెమ్మదిగా కేబిన్ తలుపు తెరిచి, అవతలకి తొంగిచూశాడు. నడవాలో యెవ్వరూ లేరు.

రమ్మన్నట్టు వాళ్ళకు సైగజేసి, బైట అడుగు పెట్టాడు. అందరూ ఇవతలికి రాగానే తిరిగి ఆ కేబిన్ తలుపుమూసి ఓడ సిబ్బంది కంటబడకుండా కాపాడుతూ వాళ్ళని డెక్ మీదికి తీసికెళ్లాడు.

సముద్రంలో అక్కడక్కడా ఆగివున్నాయి ఇతర ఓడలు. వాటిలో వెలిగే కాంతి వారిపై పడకుండా జాగ్రత్తపడుతూ డెక్ చివర చిరుచీకటి వున్నచోటికి చేరుకున్నారు లుంబా. అక్కడ వారికోసమే ఎదురు చూస్తూ నిల్చునుంది జోంజా!

“ఏర్పాట్లు పూర్తయ్యాయా?” అడిగాడు కెప్టెన్.

“ఎస్ సర్!”

“పడవల్ని సముద్రంలోకి దించండి” ఆజ్ఞాపించాడు యువకుల్ని.

అక్కడే హేంగర్లకు వేళాడుతున్న మూడు పడవల్ని తాళ్ళ సాయంతో నీటిలోకి జారవిడిచారు వాళ్ళు. తరువాత తాళ్ళ నిచ్చెన వదలబడింది. కెప్టెన్ వృద్ధుడివైపు తిరిగి, “ఓడలో మోటర్ బోట్లుకూడా వున్నాయి. అందులో వెళితే మోటర్ల శబ్దం వినిపిస్తుంది. అందుకే ఈ తెడ్ల పడవల్ని యేర్పాటు చేశాను” అన్నాడు సంజాయిషీ చెప్పుకుంటూ.

“చాలా మంచి పని చేశావు నాయనా! యెంత త్వరగా మన పని ముగించుకు వస్తే అంత మంచిది” అన్నాడు వృద్ధుడు.

యువకులవైపు చూశాడు లుంబా. “ముందు మీలో

ఇద్దరు దిగి, పడవ యెక్కండి. ఒక్కో పడవలో ఇద్దరు చొప్పున ప్రయాణించాలి. నేను గురుదేవులతో ఓ పడవ యెక్కుతాను. మీ రెండు పడవల మధ్య మా పడవ ప్రయాణిస్తుంది. ఓ. కే?"

తలలూపారు యువకులు గంగిరెద్దుల్లా.

వారు నిచ్చెన దిగి పడవలెక్కాక, జోంబా వైపు తిరిగాడు కెప్టెన్, "మేము తిరిగి వచ్చేవరకూ నా ఆదేశాలను జాగ్రత్తగా అమలు చెయ్యాలి సుమా!"

"ఆల్ రైట్ సర్!"

తెడ్ల సాయంతో కదిలాయి పడవలు. అరగంట తరవాత రేవుకు యెడంగా చాలాదూరం వచ్చేశాయి. "కాసేపు ఆపండి ఇక్కడ!" అంటూ బైనాక్యులర్స్ బైటికితీశాడు కెప్టెన్.

పడవలు ఆగాక, బైనాక్యులర్స్‌తో మసకచీకట్లో చుట్టూ కలయచూశాడు పరీక్షగా. దూరాన యూకలిప్టస్ చెట్లతో నిండిన ఒడ్డు కనిపిస్తోంది.

చేత్తో అటు సైగ చేస్తూ, "పదండి అక్కడికి" అన్నాడు.

తిరిగి ప్రారంభమైంది పడవల ప్రయాణం! ఒడ్డు చేరగానే మరోసారి బైనాక్యులర్స్‌తో చుట్టూ కలయజూసి యెవ్వరూ లేరని నిర్ధారించుకొని, అందర్నీ దిగమన్నట్టు సైగ చేశాడు కెప్టెన్. యువకులు బిలబిల దిగి, పడవల్ని ఒడ్డుమీదికి లాగి చెట్లమాటున దాచేశారు.

"ఇంతవరకూ మనకే అడ్డంకులూ యెదురుకాలేదు. క్షేమంగా ఒడ్డుచేరాం! ఇక ఇప్పుడు ప్రారంభం కాబోతోంది మన ప్రమాదకర ప్రయాణం! దట్టమైన కీకారణ్యాల్లో పుట్టి పెరిగిన జాతి మనది.

అదృష్టవశాత్తూ నేను నగరాల్లో పెద్ద చదువులు చదివి ఈనాడు ఈ స్థితికి చేరినవాణ్ని కనక, ఈ నగర వాసుల గురించీ, నగర జీవనం గురించీ మీకన్నా నాకే ఎక్కువ తెలుసు.

వీసా, పాస్‌పోర్ట్‌లాంటి అధికార పత్రాలు లేనిదే ఒక దేశవాసులు మరో దేశంలో అడుగుపెట్టడం నేరం! అందుకే మిమ్మల్ని ఓడలో రహస్యంగా ఇక్కడికి తీసుకు రావలసి వచ్చింది. అది తొలి ప్రయత్నం!

అందులో మనం సఫలీకృతులమయ్యాం! ఇప్పుడు మిగిలింది రెండో ప్రయత్నం! నగరం నడిబొడ్డున వున్న మనకావలసిన వ్యక్తి భవనాన్ని చేరడం అంత సులభ తరమైన పనికాదు.

రాత్రిపూట గస్తీ పోలీసులు తిరుగుతుంటారు. అదు గడుగునా ఇతర అధికార్లు తారసపడవచ్చు. వారికంట బడకుండా యెంతో మెలకువగా ఆ భవనాన్ని చేర వలసి వుంటుంది.

ఏ అవరోధం లేకుండా ఆ భవనంలో అడుగుపెట్ట గలిగినప్పుడే మన మూడో కార్యక్రమం అసలు జరుగు తుంది. అదృష్టం మన పక్షాన లేకుంటే మనలో ఒక రిద్దరి ప్రాణాలు పోయినా పోవచ్చు" అన్నాడు లంబా రుద్రకంఠంతో.

"ప్రాణాలుమీద మాకు తీపిలేదు. అన్నిటికీ మేము సిద్ధపడే వచ్చాం!" అన్నారు యువకులు ఆవేశంగా.

"జాతి క్షేమంకోసం గడిపోచవు సరితూగని ఈ ప్రాణాలు పోయినా, ఉన్నా ఒక్కటే కదా నాయనా! వాటిని పణంగా పెట్టడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ మేము వెనక్కి తగ్గం! పద. ఇప్పటికే బాగా పొద్దుగూకింది"

అన్నాడు వృద్ధుడు ఆరాటాన్ని ఆపుకోలేక.

రిస్టువాచీ చూసుకున్నాడు కెప్టెన్. పన్నెండున్నర!

"ఔను. ఈపాటికి సెకండ్ షో సినిమాలు వది లుంటారు. రోడ్లు నిర్మానుష్యమై వుంటాయి, పదండి" అన్నాడు ముందుకు సాగుతూ.

మిగతా సహచరులు అతన్ని అనుసరించారు. ఇసక తిన్నెలు దాటి కొద్దిసేపట్లో రోడ్డుమీదికి వచ్చారంతా. ట్యూబ్ లైట్స్ కాంతిలో రోడ్లు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

4

మసక చీకట్లో నిల్చుని చుట్టూ జాగ్రత్తగా కలయ చూశాడు కెప్టెన్. అప్పుడప్పుడూ అక్కడక్కడా స్పీడుగా సాగిపోతున్న కార్లు తప్ప, కాలినడకనగానీ, సైకిళ్ళమీదగానీ యెవ్వరూ కనిపించడంలేదు.

"పదండి. నడిరోడ్డుమీద నడవొద్దు. లైట్ల కాంతి మీద పడకుండా రోడ్డు చివర, మసక చీకట్లో నడవాలి" అన్నాడు కెప్టెన్ అడుగు ముందుకు వేస్తూ.

యువకులు రోడ్డుమీద అటూ ఇటూ తిరుగుతున్న కుక్కల్ని చూస్తున్నారు కన్నార్పకుండా.

"ఇక్కడి కుక్కలు ఎంత రుచిగా వుంటాయో!" అన్నాడొకడు పెదాలు చప్పరిస్తూ.

"ష్! మాట్లాడకండి. అదుగో, ఫుట్‌పాత్ మీద బికార్లు కూర్చున్నారు" అన్నాడు లంబా.

భుజాల చుట్టూ చింకిగుడ్డలు కప్పుకొని, బీడీలు కాలుస్తూ మాట్లాడుకుంటున్న ఇద్దరు బికారీలు అదివరకు చూడని వారి విచిత్రాకృతుల్ని, రూపురేఖల్నీ నోళ్ళు వెళ్ళబెట్టి చూడసాగారు.

మానంగా వార్ని దాటి, రోడ్డు కుడివైపు తిరిగారంతా. అలా కొద్ది దూరం నడిచారో లేదో, దూరాన యేదో వాహనం వస్తున్నట్టు హెడ్ లైట్స్ కాంతి కనిపించి, అందర్నీ ఆగమన్నట్టు చెయ్యెత్తాడు లంబా. ఊపిరి బిగబట్టి ఆగిపోయారంతా.

వాహనం దగ్గరవుతున్న కొద్దీ దాని ముదురు నీలిరంగునూ ముందు భాగంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న తాటికాయంత తెల్లని అక్షరాలనూ, ఊగుతున్న వైర్లెస్ ఏరియల్నీ చూడగానే, "పోలీస్!" అన్నాడు లంబా.

గతుక్కుమన్నాయి అందరి గుండెలూ.

"ఆ సందులోకి తప్పుకోండి, అది పోలీస్ పెట్రోలింగ్ వాన్!" అన్నాడు లంబా రోడ్డుపక్కనున్న ఓ సందు చూపుతూ.

అందరూ సందులో దూరి, గోడకు బల్లుల్లా అతుక్కుపోయారు.

మరో క్షణంలో పోలీస్ పెట్రోలింగ్ వాన్ దూసుకు పోయింది రోడ్డుమీద.

తర్వాత కెప్టెన్ సందుచివరికెళ్ళి అటూ ఇటూ తొంగి చూసి, రోడ్డుమీద యెవ్వరూ లేరని నిర్ధారించుకొని, పదమన్నట్లు సైగ చేశాడు. చిరు చీకట్లో నడుస్తూ అనేక సందులూ గొందులూ తిరిగి, చివరికో వీధిలోకి ప్రవేశించారు.

సాధారణంగా ఆ వీధిలో నివసించేది ధనవంతులే. అధునాతన రీతిలో విశాలంగా, విడివిడిగా, వరుస క్రమంగా కట్టి వున్నాయి అనేక భవనాలు. కెప్టెన్ని అనుసరిస్తున్న వృద్ధుడు హఠాత్తుగా ఆగి, మిగతావారిని కూడా ఆగమన్నట్టు సైగ చేశాడు. కెప్టెన్ ప్రశ్నార్థ

కంగా చూశాడతన్ని.

వృద్ధుడు పలకలేదు. తలెత్తి, గాలిలో ఏదో వాసన చూడసాగాడు. మరుక్షణం ముడతలుపడ్డ అతని మొహం తామరపుష్పంలా వికసించింది. "లుంబా! మన గమ్యం వచ్చేసింది. ఆ పవిత్ర సుగంధ పరిమళం ఇదుగో నా ముక్కుపుటలకు స్పష్టంగా తాకుతోంది. మాకు సరైన దారిచూపి, మనజాతి యావత్తుకూ నువ్వు చేసిన మేలు మరవరానిది."

నవ్వాడు కెప్టెన్. "మన జాతికోసం ఇప్పటికీ నేను చెప్పుకోతగ్గ సేవ చెయ్యలేదు గురుదేవా! పోతే, మన గమ్యాన్ని చేరుకున్నామన్న మీమాట అక్షరాల నిజం! అదుగో, అదే మన గమ్యం!" అన్నాడు అమడదూరంలో వున్న ఓ భవనంవైపు చూపుతూ.

అందరి కళ్ళూ జిగేల్మన్నాయి.

వృద్ధుడు సాలోచనగా తలూపుతూ, "మేము అంధకారపు అడవుల్లో పుట్టి పెరిగినవాళ్ళం! ఈ ఆధునిక వెలుగు లోకపు మాయలు మాకు తెలీవు. తెగించి గమ్యాన్నైతే చేరుకున్నాంగానీ, ఆ భవనంలో ప్రవేశించడానికెన్ని అడ్డంకులు అధిరోహించాలో మాకన్నా నీకే బాగా తెలుసు. ఎన్నో ఏళ్ళనించీ నువ్వీలోకంలో ఊపిరి తీసుకుంటున్నావుకదా, మా మార్గం సుగమం చెయ్యి లుంబా!" అన్నాడు.

"అలాగే గురుదేవా! రండి" అంటూ అడుగు ముందుకు వేశాడు కెప్టెన్.

5

రాత్రి రెండవుతోంది. ముందే చలికాలం! మనిషి మాత్రుడు లేడు వీధిలో. స్ట్రీట్ లైట్స్ గుడ్డిగా వెలుగు

తున్నాయి. ఆ నిశీధిలో చలికి తాళలేక యెక్కడో ముడుచుకొని ఆగి ఆగి రోదిస్తోంది ఓ ఊరకుక్క.

ఆ భవనాన్ని చేరగానే ఆగమన్నట్లు సైగ చేశాడు కెప్టెన్. అందరూ మర బొమ్మల్లా నిల్చుండిపోయారు. కాంపౌండ్ గోడకు నక్కి నిల్చోమన్నట్టు సైగ చేశాడు కెప్టెన్. అందరూ గోడకు అతుక్కుపోయారు బల్లుల్లా!

అడుగులో అడుగు వేసుకుంటూ కాంపౌండ్ గేటువైపు నడిచాడు కెప్టెన్. మూసివుంది. దానికిరుపక్కలా లైట్లు. వాటి కాంతిలో గేటుపక్కన వేళ్ళాడుతున్న నేమ్ ప్లేట్ మీద నిలిచాయి కెప్టెన్ చూపులు.

మేజర్ విక్రమనాయుడు (రిటైర్డు) అని చెక్కివుంది దానిమీద.

సాలోచనగా తలూపుతూ పిల్లిలా గేటుని సమీపించాడు కెప్టెన్. కాంపౌండ్ లోపల గేటునానుకొని వుంది, గూర్ఖా కూర్చునే చెక్క కేబిన్.

“వాచ్ మేన్!” పిల్చాడు తగ్గు స్వరంతో.

మరుక్షణం దిగ్గున లేచి ఇవతలికి వచ్చాడు గూర్ఖా.

“కౌన్ హై?” అడిగాడు కెప్టెన్ని ఎగాదిగా చూస్తూ.

అప్పుడు పడింది లుంబా దృష్టి గూర్ఖా నడుంకి వేళ్ళాడుతున్న ఖుక్రీ (కత్తి)మీద. బదులివ్వకుండా గోడకు నక్కి నిల్చున్న తన సహచరులవైపు చూశాడు. నిదరమబ్బులో వున్న గూర్ఖాకు అర్థంకాక, గేటు చువ్వలగుండా తల ఇవతల పెట్టి అటు చూశాడు. అంతే!

ఉక్కు పంజాలతో మెరుపులా వాడి మెడ పుచ్చుకున్నాడు కెప్టెన్. ఐనా, బెల్టుకి వేళ్ళాడున్న ఒరలోంచి కత్తి లాగనే లాగాడు గూర్ఖా! అప్పటికే లుంబా

ఒంట్లోని అపారశక్తి తన పని పూర్తిచేసింది.

కోడి మెడ విరిచినట్టు విరిచి, ఒళ్ళు చల్లబడేవరకూ అలాగే పట్టుకొని, పక్కకు తోశాడు వాణ్ని. చిన్న శబ్దంతో నేలకూలింది గూర్ఖా శవం! గేటు కొక్కెంతీసి, రమ్మన్నట్టు సైగచేశాడు తనవాళ్ళని.

అందరూ బిలబిల కాంపౌండ్లోకి చేరారు. "ఇదేమిటి?" అడిగాడొకడు కిందపడ్డ గూర్ఖా శవం చేతిలోని కత్తి అందుకుంటూ.

"దాన్ని ఖుక్రీ అంటారు. నేపాలీ దేశస్థులు వాడే ఆయుధం! పనికిరావచ్చు. వుంచు" అంటూ చుట్టూ కలయచూశాడు కెప్టెన్. ఏ అలికిడీ లేదు. పైన మేడ మీద మూసి వున్న కిటికీల్లోంచి జీరోవాల్టు మసక వెలుగు కనిపిస్తోంది. ఇంట్లోకి ప్రవేశించే సింహద్వారం మూసివుంది.

"రండి" అంటూ అటు నడిచాడు కెప్టెన్.

తలుపుని సమీపించారందరూ.

"నకోనా!" పిల్చాడు వృద్ధుడు నెమ్మదిగా.

"గురుదేవా?" అన్నాడు నలుగురిలో ఒకడు.

వృద్ధుడి చూపులు మూసివున్న తలుపుమీదే వున్నాయి. "చింతపులి తింటూ పెంచుకున్న నీ కండబలాన్ని ప్రయోగించే సమయం ఆసన్నమైంది. ఊఁ ఆ తలుపుల్ని పెకలించి పక్కన పెట్టు!"

"ఆజ్ఞ గురుదేవా!" అంటూ తలుపువైపు కదిలాడు నకోనా.

గోడకున్న బటన్ వత్తి పోర్టికో లైటార్పేశాడు కెప్టెన్. మూసి వున్న తలుపుముందు నిల్చుని, కాసేపు

దాన్ని పరీక్షించి, రెండు చేతులతో బిగబట్టి, సవ్వడి కానివ్వకుండా కదపసాగాడు నకోనా!

పదినిమిషాల తరవాత కొక్కాలతోసహా ఊడి, గడపనించి వేరైంది ఓ రెక్క. "చాలు. రెండోది వుండనివ్వు" అన్నాడు కెప్టెన్.

ఊడబెరికిన రెక్కను పక్కన పెట్టి, నెమ్మదిగా లోనికి ప్రవేశించాడు నకోనా. అతని వెనకే అందరూ అడుగు పెట్టారు. అది హాలు. హాలుమధ్య సోఫాసెట్టు. జీరో వాల్టు మసగ్గా వెలుగుతోంది.

హాలు కుడిపక్క గోడవారగా మెట్లున్నాయి పైకెళ్ళడానికి. ఇంట్లో సూది పడితే వినిపించే నిశ్శబ్దం! కెప్టెన్ని అనుసరిస్తూ ఒకరి వెనక ఒకరు మెట్లెక్కి చేరుకున్నారు. వరసగా నాలుగ్గదులున్నాయి పైన. తలుపులు మూసున్నాయి.

ఒక్కో గది ముందాగి, వాసన చూడసాగాడు వృద్ధుడు. మూడో గది ముందాగగానే అతని మొహం వికసించింది. పట్టరాని ఆనందంతో నెమ్మదిగా తోశాడు తలుపుని. కిర్రుమంటూ తెరుచుకుంది. దడదడలాడే గుండెలతో అందరూ అడుగు పెట్టారు లోన.

అది బెడ్రూం! నీలిరంగు జీరో వాల్టు మసగ్గా వెలుగుతోంది. ఆ కాంతిలో యెదురుగా కనిపించిన దృశ్యం వాళ్ళని దాదాపు శిలాప్రతిమల్ని చేసివేసింది. గోడవారగా మంచం! పరుపుచుట్టూ సన్నని ఉల్లిపొరలాంటి దోమ తెర.

ఆ దోమ తెర లోపల ఆదమరచి హాయిగా నిద్రిస్తోంది ఓ యువతి! పుత్తడి బొమ్మలాంటి అందమైన యువతి! భక్తి ప్రపత్తులతో చేతులు జోడించి ఆ యువతి

వైపు చూస్తూ అన్నాడు వృద్ధుడు, “మువాంగా!”

మరుక్షణం అందరూ చేతులు జోడించి తలలు వంచుకున్నారు.

“ఇంతకాలం మనం వెతుకుతున్న మన ఆరాధ్య దైవం ఈమే! ఇక మన జాతికి యే అనర్థమూ వాటిల్లదు. ఏ రోగమూ దరిజేరదు. ఎవ్వరూ ఆకలిదప్పులతో అలమటించరు. మన పొలాలూ, చెట్టుచేమలూ మళ్ళీ పచ్చగా సస్యశ్యామలమౌతాయి. శత్రు తెగలతో జరిగే పోరాటాల్లో ఇక అంతిమ విజయం మనదే!” అంటున్నాడు వృద్ధుడు పారవశ్యంతో.

మిగతా వారిలో నూతనోత్తేజం వెల్లివిరుస్తోంది. నిశ్శబ్దంగా వింటూ నిల్చున్నారు.

“మువాంగా తల్లి బాల్యంనించీ ఈ వెలుగు ప్రపంచంలో పెరిగింది. ఇప్పుడు మనల్ని గుర్తుపట్టదు. పైగా, భయపడవచ్చు. అందుకే, ఆమె లేవకముందే వనమూలికల చూర్ణాన్ని వాసన చూపి మూర్ఛపోగొట్టి మోసుకెళ్ళాలి. ఎప్పుడైతే ఆమె తిరిగి తన రాజ్యాన్ని చేరుకుంటుందో, అన్నీ ఆమెకు జ్ఞప్తికొస్తాయి. ఇన్నాళ్ళూ తనకోసం కళ్ళు కాయలు కాచేలా యెదురుచూస్తున్న తన భక్తుల్ని అప్పుడు తప్పక గుర్తుపడుతుంది. మన పూజలందుకొని, తన ఆశీర్వాదాలతో మన బ్రతుకులు పావనం చేస్తుంది” అంటూ మోకాళ్ళమీద కూర్చుని, చేతులు జోడించాడు వృద్ధుడు.

“తల్లీ! మువాంగా! వనమూలికలతో నిన్ను మూర్ఛపోగొట్టి, బలవంతంగా ఎత్తుకెళ్ళడం మహాపచారమే! కానీ, అంతకుమించి మరో మార్గం కనిపించడంలేదు తల్లీ! మమ్మల్ని క్షమించు” అంటూ శిరస్సు వంచి లేచి

నిల్చున్నాడు. సంచీలోంచి కొన్ని వనమూలికలూ, ఆకులూ తీసి, బాటనవేలితో వాటిని చూర్ణం చెయ్యసాగాడు.

అప్పుడు కదిలింది యువతి మంచంమీద!

అందరూ ఊపిరి బిగబట్టి చూడసాగారు.

కళ్ళు తెరిచింది యువతి. నెమ్మదిగా తలతిప్పి చూసింది వాళ్ళవైపు.

అంతే!

6

కవ్వున కేక!

భయంతో ఒళ్ళు జలదరించేలా పెట్టిన గావుకేక!!

భవనం యావత్తూ దద్దరిల్లింది ఆ కేకతో.

ఆ హఠాత్పరిణామానికి చేష్టలుడిగి రాతిబొమ్మలై పోయారందరూ. ఒక్క ఉదుటున మంచంమీంచి లేచిందా యువతి. ఎందుటూకులా వణుకులోంది గజగజ.

"తల్లీ మహారాణీ! మమ్మల్ని చూసి భయపడకమ్మా! మేము మీ శత్రువులం కాము. భక్తులం! నీ సేవకులం! నీకపకారం చెయ్యడానికి రాలేదు. నిన్ను మళ్ళీ మన జన్మభూమికి తీసికెళ్ళి ప్రతిష్ఠించుకోడానికి వచ్చాం.

మా కొలువులు సేవించి, మమ్మల్ని ఆశీర్వదించి, మా బ్రతుకుల్లో పేరుకున్న చీకట్లను పారద్రోలి, మళ్ళీ నూతన వెలుగులు ప్రకాశింపజేయి తల్లీ!" అన్నాడు వృద్ధుడు చేతులు జోడిస్తూ.

వాళ్ళ విచిత్ర రూపురేఖలకూ, అర్థంకాని భాషకూ ఖంగుతిన్న ఆ యువతి మళ్ళీ గావుకేక పెట్టబోయింది. వృద్ధుడు మెరుపులా ఆమెను సమీపించి, పొదివిపట్టుకుని, చేతిలోని చూర్ణాన్ని ఆమె ముక్కు దగ్గరుంచాడు. అంతే!

మరుక్షణం యువతి సొమ్మసిల్లి, అతని బాహువుల్లో సోలిపోయింది. వృద్ధుడు జాగ్రత్తగా ఆమెను భుజాన వేసుకుని, "పదండి" అంటూ వెనుదిరిగాడు.

అందరూ అతనితో బాటు వెనుదిరిగి, తలుపువైపు అడుగు వేశారు. అంతే! వారి అడుగులు స్తంభించి పోయాయి. గుండెలు గుభిల్లుమన్నాయి. తలుపుమధ్య రెండు చేతుల్లో పిస్తోళ్ళు పట్టుకొని నిల్చున్నాడో వ్యక్తి. సుమారు యాభై ఏళ్ళుంటాయతనికి. నెరసిన తల, కోరమీసాలు. ఆజానుబాహుడు. అంత వయసులోనూ దృఢంగా, పుష్టిగా వున్నాడు.

అతన్ని పరీక్షగా చూసి, గుర్తుపట్టి, చిన్నగా నవ్వాడు వృద్ధుడు. "మేజర్ నాయుడూ! ఇంకా గుర్తు పట్టలేదా నన్ను? ఔన్లే! అమాయకులమూ, నిరక్షరాస్యులమూ అయిన మా నమ్మకాలనీ, ప్రేమాభిమానాలనీ, షరతులనీ, తృణప్రాయంగా ఎంచి, తృణీకరించి, మమ్మల్ని నట్టేట్లో ముంచి పారిపోయి వచ్చినవాడివి. ఇన్నాళ్ళ తరవాత ఇంకెక్కడ గుర్తుంటాం నీకు?"

అప్పుడు విప్పారాయి మేజర్ నాయుడు కళ్ళు. "అగోసా! నువ్వా!! ఇంకా బ్రతికే వున్నావా? ఇన్నేళ్ల తరవాత ..." అన్నాడు దిగ్భ్రాంతితో.

"ఔను మేజర్! ఇంకా బ్రతికే వున్నాను. మువాంగా తల్లిని తిరిగి నా జాతి కప్పగించేవరకూ మరణించనని శపథం పూని మృత్యువును దరిచేరనివ్వకుండా యింకా బ్రతికేవున్నాను" అన్నాడు వృద్ధుడు.

"నేనిక్కడున్నానని ఎలా కనుక్కున్నారు? ఎలా రాగలిగారిక్కడికి?" అడిగాడు మేజర్ నిర్ఘాంతపోతూ.

కెప్టెన్ లంబావైపు సైగజేశాడు వృద్ధుడు. "ఇతన్ని

గుర్తుపట్టావా? లేదనుకుంటాను. ఎలా గుర్తుపడతావు?
నువ్వు మమ్మల్ని విడిచి వచ్చినప్పుడు వీడు ఆరేళ్ళ పసి
వాడు. తరవాత వెలుగు ప్రపంచంలో పెరిగి పెద్దవాడై,
బాగా చదువుకుని, సముద్ర ఓడమీద ఉద్యోగం సంపా
దించాడు.

నా ఆదేశానుసారం దేశదేశాలు తిరుగుతూ నీ ఆచూకీ
తియ్యసాగాడు. చివరికి నువ్వీ దేశంలో వున్నావని
పసిగట్టి నన్నూ, నా శిష్యుల్ని రహస్యంగా ఓడలో
దాచి, ఇక్కడికి చేర్చాడు.

"సంతోషం! చాలా సంతోషం! పదహారేళ్ళ తరవాత
మళ్ళీ మిమ్మల్ని చూడగలిగినందుకు నాకెంతో ఆనం
దంగా వుంది ఆగోసా! ఐతే, మీరిలా అర్ధరాత్రి దొంగ
చాటుగా కాక, పగలు నేరుగా వచ్చివుంటే, ఇంకా
బావుండేది.

ఐనా, మీరిలా వచ్చినందుకు నాకేం కోపంలేదు.
అమ్మాయిని తిరిగి మంచంమీద పడుకోబెట్టి అలా
కూర్చోండి. తీరిగ్గా మాట్లాడుకుందాం!" అన్నాడు
మేజర్ వచ్చీరాని ఆఫ్రికన్ భాషలో.

"మేము తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్పడానికి రాలేదు
మేజర్! మా ఆరాధ్య దేవత మువాంగా తల్లిని తిరిగి
మా దేశానికి తీసికెళ్ళడానికి వచ్చాం!" అన్నాడు
వృద్ధుడు కటువుగా.

మేజర్ మొహం మారిపోయింది. "ఆమె మువాంగా
కాదు. నా కన్న కూతురు శ్రీవిద్య! ఈ బొందిలో
ప్రాణం వుండగా నా కూతుర్ని మీ పరం చేస్తానను
కున్నారా? మర్యాదగా ఆమెను మంచంమీద పడుకో
బెట్టు."

నవ్వాడు వృద్ధుడు. "నీకామె శ్రీవిద్య కావచ్చు. నీ రక్తం పంచుకు పుట్టిన కూతురే కావచ్చు. కానీ ఆమె పుట్టగానే మేమామెకు పెట్టిన పేరు ముహాంగా! చూడు పుట్టగానే గుర్తింపుకోసం మేమామె చేతిమీద పొడిచిన పచ్చబొట్టు గుర్తులు.

"మేజర్! నువ్వు విశ్వాసఘాతకుడివి. ద్రోహివి నీమీద మేము అల్లుకున్న అపార నమ్మకాన్ని వమ్ముచేసి, మా కళ్ళలో కారం చల్లి మమ్మల్ని ముహాంగా తల్లికి దూరం చేశావు. మా జాతిని అనేక ఇక్కట్లపాలు చేశావు.

"సరే! జరిగిందేదో జరిగిపోయింది. ముహాంగా తల్లి మళ్ళీ మాకు దొరికింది. ఇప్పుడు నీమీద మాకేం కోపం లేదు. మమ్మల్ని వెళ్ళనివ్వు. మా దారి కడ్డంరాకు. ఊఁ!" అంటూ అడుగు ముందుకు వేశాడు వృద్ధుడు.

"ఆగు! కాలు కదపక! నా చేతుల్లో యేమున్నాయో చూడు. నన్ను ఉద్రేకపర్చకండి. నా బిడ్డను నాకప్పగించి, మర్యాదగా వెళ్ళిపొండి. మిమ్మల్నేమీ చెయ్యను" అన్నాడు మేజర్ నాయుడు హెచ్చరిస్తూ.

పకపక నవ్వాడు వృద్ధుడు. "నీలా మమ్మల్ని పిరికి పందలకింద జమకట్టక మేజర్! ఆచారాలకూ, నమ్మకాలకూ కట్టుబడి బ్రతికే జాతి మాది. మర్యాదగా మా దారి కడ్డుతొలుగు."

"లేకుంటే ఏం చేస్తారు?"

వృద్ధుడు పలకలేదు. తన ఇద్దరు శిష్యులవైపు చూసి సైగ చేశాడు. అంతే! ఆ సజ్ఞకోసమే ఎదురుచూస్తున్న వాళ్ళు అమాంతం లంఘించారు మేజర్ మీదికి.

మరుక్షణం నాయుడు చేతుల్లోని రెండు పిస్తోళ్ళూ రెండు గుళ్ళు వెళ్ళగక్కుతూ మాార్మోగాయి. అంతే

ఎగిరినవాళ్ళు ఎగిరినట్టే అమాంతం నేలకూలారు. గిలగిల తన్నుకోసాగారు.

ఆ దృశ్యం చూడగానే కెప్టెన్ కళ్ళు విప్పారాయి గానీ, వృద్ధుడు మాత్రం నిశ్చలంగా నేలమీద తన్నుకుంటూ ప్రాణాలు విడిచిన వాళ్ళను చూస్తూ, తరవాత మేజర్ వైపు తిరిగాడు.

"వాళ్ళు చనిపోయినందుకు నేను చింతించడంలేదు మేజర్! చాలా సంతోషిస్తున్నాను. వాళ్ళు చనిపోలేదు. అమరులయ్యారు. జాతి హృదయాల్లో చిరంజీవులయ్యారు. ఇలాంటి మరణం యెందరికి లభిస్తుంది? వాళ్ళను చంపినంతమాత్రాన మేము భయపడి నీకు లొంగిపోతామనుకున్నావా? లేదు. మమ్మల్ని నువ్వు ఆపలేవు మేజర్!" అంటూ అడుగు ముందుకేశాడు.

"చివరిసారి చెబుతున్నాను అగోసా! ఆగిపో" మేజర్ మాట పూర్తికాకముందే మరో ఇద్దరు యువకులు ఆయన మీదికి లంఘించారు.

మేజర్ చేతుల్లోని రివాల్వర్లు గర్జించాయి మళ్ళీ. క్షణంలో వారి శరీరాలు నేల కరిచాయి. "అగోసా! ఇది ఆఖరి హెచ్చరిక, నీ మూర్ఖత్వంవల్ల నలుగురు నేలకొరిగారు. ఇప్పటికీ మించిపోయింది లేదు.

వ్యక్తిగతంగా మీమీద నాకెలాంటి ద్వేషంలేదు. నన్నరం చేసుకోండి. కన్నకూతుర్ని ఒక్కగానొక్క కూతుర్ని మీకెలా అప్పగించమంటారు? ఆమె లేనిదే నా జీవితం శూన్యంకాదా? శాంతంగా ఆలోచించండి. నా బిడ్డను నాకప్పగించండి" అన్నాడు నాయుడు ప్రాధేయపూర్వకంగా.

"అసంభవం! పుట్టకముందే నువ్వామెను మాకప్ప

గించావు. మా షరతుల కంగీకరించావు మేము చేస్తున్నది నీతిబాహ్యమైన పనేం కాదు. ఇక అడ్డుతొలుగు" అంటూ మరో అడుగు ముందుకేశాడు వృద్ధుడు.

"నా సహనాన్ని పరీక్షించకండి. చెప్పిన మాట వినండి."

"ఇప్పటికే చాలా ఓర్మి వహించాను మేజర్! ఇక సహించేదిలేదు. కాచుకో!" అంటూ చిరుతలా నాయుడు మీదికి లంఘించాడు కెప్టెన్ లుంబా.

"ఢాం!" మంది రివాల్వర్.

కడుపు పట్టుకున్నాడు కెప్టెన్. తెల్లచొక్కా రక్తంతో తడవసాగింది ఎర్రగా!

మరోసారి మారుమోగింది రివాల్వర్.

మొదలు నరికిన చెట్టులా నేలకూలాడు కెప్టెన్ లుంబా!

నాయుడి కంఠం ఖంగుమంది. "ఆగోసా! ఇక మిగిలింది నువ్వే! నీ మూర్ఖత్వంవల్ల ఇందరి ప్రాణాలు బలయ్యాయి. ఇప్పటికీ మించిపోలేదు. నా బిడ్డను నాకప్పగించి నీ దారిన వెళ్ళు."

పకపక నవ్వాడు వృద్ధుడు. "పిచ్చి మేజర్! ప్రాణభీతి గలవారిమైతే తెగించి ఇంతదూరం వచ్చేవారమా? నన్ను చంపాలనుకుంటే నిస్సంకోచంగా చంపెయ్! కాదనను. కానీ, చంపేముందు ఒక విషయం మాత్రం గమనించు. మువాంగా తల్లి నా భుజంమీదుంది.

ఆమెకే అపాయం కలక్కుండా నీ ఆయుధాన్ని సరిగా నా నుదుటికి గురిపెట్టు. నాతోబాటు మువాంగా తల్లి కిందపడకముందే ఆమెను పొదివిపట్టుకో. ఇదే నా చివరి కోరిక!"

ఆ మాటలకు చలించిపోయాడు మేజర్. "నిన్ను చంపడంవల్ల నాకొరిగేదేమీ లేదు అగోసా! దయచేసి నా మాట విను. మంకుపట్టు వదులు" అన్నాడు ప్రాధేయపడుతూ.

"ఐతే, నన్నే ఆ మృత్యుదేవతను కౌగలించుకోనివ్వు" అంటూ వెనుదిరిగాడు వృద్ధుడు.

భుజంమీద పడున్న శ్రీవిద్యను నెమ్మదిగా మంచం మీద పడుకోబెట్టి మెరుపులా వెనుదిరిగి మేజర్ మీదికి లంఘించాడు. అంతే!

"ఢాం!" మంది రివాల్వర్.

గుండు మెడలో దిగబడింది. చేత్తో గాయాన్ని అదిమి పట్టుకున్నాడు అగోసా! అతని బాధ చూడలేక రెండో వాల్వర్ని అతని గుండెకి గురిపెట్టాడు మేజర్. ట్రిగ్గర్ ఒత్తాడు నెమ్మదిగా. రివ్వున దూసుకెళ్ళి అగోసా గుండెలో దిగింది గుండు.

"తల్లీ....మ్....ము....వాం....గా!" అంటూ గుండె పట్టుకొని నేలకూలాడు.

శిలాప్రతిమలా నిల్చుని, నేలపైపడున్న ఆరు శవాలని చూస్తుండిపోయాడు మేజర్ నాయుడు, ఆయన హృదయ కుహరంలో నీరు ఊరి, కళ్ళను తడిపివేస్తోంది నెమ్మదిగా.

రివాల్వర్లను జారవిడిచి, మోకాళ్ళమీద కూలబడి, చేతులు జోడించాడు. "మీ పవిత్ర హృదయాలకు ఇవే నా జోహార్లు. నమ్మిన దానికోసం ప్రాణాలను కూడా పూజ్యంగా భావించిన మీరు మహనీయులు, మహోన్నతులు.

నేను పాపిని. అల్పుణ్ణి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని, భవబంధాలను త్రెంచుకోలేని అధముణ్ణి. నన్ను

క్షమించండి. కరుణించండి" అంటూ శిరస్సువంచి, కళ్లు మూసుకొని, రెండు నిమిషాల తరవాత లేచి నిల్చు న్నాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ టెలిఫోన్ వైపు నడిచి, ముందు డాక్టర్ కూ, తరవాత పోలీసులకూ రింగ్ చేసి, మంచంమీద పడున్న కూతుర్ని సమీపించాడు.

7

"షాక్ వల్ల స్పృహ తప్పింది. మరేం ఫరవాలేదు" అన్నాడు డాక్టర్ శ్రీవిద్యని పరీక్షించి, స్టెతస్కోప్ బ్యాగ్ లో పెట్టుకుంటూ.

అప్పుడు కుదుటపడింది మేజర్ నాయుడు మనసు.

అంతలో బైట జీపు ఆగిన చప్పుడూ, నలుగురైదుగురు గబగబ లోనికి వస్తున్న చప్పుడూ వినిపించి, బైటికి నడిచాడు నాయుడు.

పోలీసులు!

వాళ్ళని శవాలు పడున్న గదిలోకి తీసికెళ్ళాడు నాయుడు. ఆ శవాల అవతారాలు చూడగానే ఆశ్చ ర్యంతో అవాక్కయిపోయాడు ఇన్స్పెక్టర్.

"నీగ్రోస్!"

తలూపాడు నాయుడు.

"ఎవరో స్థానిక దొంగలు మీఇంట్లో దూరి వుంటా రనుకున్నాను. వీళ్ళు ఆఫ్రికన్ నీగ్రోస్. బైట గేటు దగ్గర చచ్చిపడున్న గూర్ఖానీ, ఊడపెరికిన తలుపునీ, ఇంట్లో చచ్చిపడున్న వీళ్ళనీ చూస్తోంటే, నిస్సందేహంగా వీళ్ళు మీ కేదో అపకారం చెయ్యడానికే వచ్చుంటారని పిస్తోంది.

అటువంటప్పుడు ఆత్మరక్షణార్థం మీరు వీళ్ళని

చంపడం చట్టరీత్యా నేరంకాదు. ఒప్పుకుంటాను. ఐతే, పరదేశీయులైన వీళ్ళు మీ ఇంట్లోకి యెందుకు జొర బడ్డారు?

అదుగో, ఆ శవంమీది దుస్తుల్ని బట్టి అతను ఓడ కెప్టెన్‌లా వున్నాడు. అంటే, వీళ్ళు తిన్నగా ఓడరేవు నించే వచ్చి వుంటారని అగమాతోంది. దొంగతనమే చెయ్యాలనుకున్నప్పుడు హార్బర్ చేరువలో ఇంకా ఎంతో మంది ధనవంతులు నివసిస్తుండగా వారి భవనాలు వదిలి అనేక ఇక్కట్లుపడి ఇంతదూరం యెందుకొస్తారు? దీన్ని బట్టి వీరి ఉద్దేశం ఇంకేదో అయివుంటుందనిపిస్తోంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ తార్కికంగా.

తలూపాడు నాయుడు. "ఔను. మీ అంచనా కరెక్టే! వీళ్ళు దొంగతనానికి నా ఇంట్లో దూరలేదు."

"మరి?"

"నా కూతుర్ని కిడ్నాప్ చెయ్యడానికి వచ్చారు."

ఆశ్చర్యంతో ఇన్‌స్పెక్టర్ కళ్ళు విప్పారాయి. "ఐనా మొదటి ప్రశ్నే ఉత్పన్నమౌతుంది. ప్రత్యేకించి మీ అమ్మాయినే అపహరించడానికి ఇంతదూరం వచ్చారంటే. ఇందులో యేదో తిరకాసుందనిపించడంలేదూ?"

"ఔను. వుంది. మామూలు తిరకాసుకాదు. మహాత్తరాశయం! వీరు మామూలు నేరస్తులుకారు. మహోన్నతులు. పునీతులు" అన్నాడు మేజర్ నాయుడు గద్గద స్వరంతో.

ఇన్‌స్పెక్టర్ కనుబొమలు ముడిపడ్డాయి. "కూతుర్ని అపహరించడానికి వచ్చినవాళ్ళంటారు. ఆత్మరక్షణార్థం కాల్చిచంపానంటారు. మామూలు నేరస్తులు కాదంటారు. మహత్తరాశయమంటారు. మీరంటున్నదేమిటో నాకర్థమై

చావడంలేదు. దీన్నిబట్టి వీళ్లు మొదటినించీ మీకు తెలిసిన వాళ్ళలా వున్నారు. ఔనా?"

తలూపాడు నాయుడు. "నిజమే! వీరితో నా పరిచయం ఈ నాటిది కాదు. ఎంతో పురాతనమైనది. అదొక గాథ! విషాద గాథ! చెబుతాను రండి" అంటూ కూతురు పడుకున్న గదివైపు నడిచాడు.

సిబ్బందికి పనులు పురమాయించి, ఆయన్ననుసరించాడు ఇన్‌స్పెక్టర్.

"స్పృహ వచ్చిందా అమ్మాయికి?" అడిగాడు నాయుడు డాక్టర్ని.

"ఇంజక్షన్ ఇచ్చాను. కాసేపట్లో వస్తుంది."

"కూర్చోండి ఇన్‌స్పెక్టర్!" అన్నాడు నాయుడు మంచం పక్కనేవున్న సోఫాలో చతికిలబడుతూ

ఇన్‌స్పెక్టర్ కూర్చున్నాక ప్రారంభించాడు నెమ్మదిగా.

8

అది 1945 సంవత్సరం! రెండవ ప్రపంచ యుద్ధం చివరి దశలో భీకర స్థాయికి చేరుకున్న ఘట్టం!

అప్పుడు నేనుమన దేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ సైన్యంలో మేజర్ గా పనిచేస్తున్నాను. జర్మన్ సైన్యం అటు యూరప్ లో నేగాక, ఇటు మధ్య ప్రాచ్యంలోని కొన్ని కీలక దేశాలగుండా కదం తొక్కుతూ దక్షిణాఫ్రికా పొలిమేరల్ని చేరి, బ్రిటిష్ సైన్యంతో భీషణ పోరాటం కొనసాగిస్తోంది.

అందులో నేనూ వున్నాను. మా బెటాలియన్ ఓకొండ ప్రాంతంలో ముందుకు చొచ్చుకొస్తున్న జర్మన్ల కాళ్ళకు అనకట్టవేసి, వెనక్కి తరిమే ప్రయత్నంలో వుంది. ఐతే,

కొండమీద బిగించి వున్న జర్మన్ల ఆర్టిలరీ ఫిరంగుల ధాటికి తట్టుకోలేక మా ప్రయత్నాలు విఫలమవసాగాయి.

నిర్విరామంగా మా వైపు గుళ్ళవర్షం కురిపిస్తున్న ఆ ఫిరంగుల నోళ్ళని శాశ్వతంగా మూయించడానికి మా పై ఆఫీసర్లు ఓ పథకం అల్లారు. ఆ పథకం ప్రకారం నా నేతృత్వంలో పదిమంది కమాండోల బృందం అర్ధరాత్రి బెలుదేరి ఆ కొండమీది శత్రుస్థావరాన్ని చేరి, చడీ చప్పుడూ కాకుండా ఆ ఫిరంగుల్నీ, శత్రు సైనికుల్నీ నాశనం చెయ్యాలి.

నిర్ణీత సమయానుసారం అర్ధరాత్రి కావలసిన ఆయుధాలతో ప్రయాణమై అష్టకష్టాలుపడుతూ కొండెక్కి ఆ స్థావరాన్ని చేరాం! కమాండో శిక్షణానుసారం అర్ధనిద్రావస్థలో వున్న సైనికుల నోళ్ళు నొక్కుతూ కత్తులతో నిశబ్దంగా పొడిచి చంపసాగాం!

అలా కొద్దిసేపట్లోనే పదీ పన్నెండుమందిని చంపామనుకుంటూనూ, అంతలో హఠాత్తుగా ఓ బండ వెనక నించి మా పై మెషిన్ గన్ గుళ్ళ వర్షం కురవసాగింది. ఆ హఠాత్పరిణామానికి నా సైనికుల్లో నలుగురు నేల కొరిగారు.

పూర్తిగా మేల్కొనున్న శత్రుసైనికు రెవరో మా కదలికలు గమనించి మా పై ఫైరింగ్ ప్రారంభించాడు. మేమూ మెరుపులా తలో బండమాటున నక్కి ఫైరింగ్ ఓపెన్ చేశాం!

ఆ శబ్దాలకు శత్రు సైనికులంతా మేల్కొని పెద్ద ఎత్తున మా పై దాడిచేశారు. ఆ కాల్పుల్లో నా సైనికులు మరో ముగ్గురు అమరులయ్యారు. గంటసేపు మా మధ్య నిర్విరామంగా జరిగింది భీషణ పోరాటం!

నేను తెచ్చుకున్న అమ్యూనిషన్ (తుపాకీగుళ్ళు) పూర్తిగా అయిపోయాయి. ఆ పోరాటంలో నా సైనికుల్లో యెంతమంది బ్రతికున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. శత్రువులు నాలుగువైపుల్నుంచి మేమున్న ప్రదేశాన్ని చుట్టుముట్టసాగారు.

వారి చేతికి చిక్కి చిత్రహింసలుపడి కుక్క చావు చచ్చేకంటే ప్రాణాలు కాపాడుకుని, పలాయనం చిత్తగించడమే మేలనిపించింది నాకు. చీకట్లో తోచిన దిక్కు పరుగుతీశాను. శత్రుసైనికుల కర్థమైపోయింది నా దగ్గర గుళ్ళు అయిపోయాయని.

నన్ను ప్రాణాలతో పట్టుకుంటే, మా రహస్యాలు కక్కించవచ్చని నా వెంటపడ్డారు. కొండ దిగి చాలా దూరం పరిగెత్తాక గానీ నాకు తెలిసిరాలేదు. నేను దిగింది కొండ కావలివైపు అనీ, మా స్థావరంవైపు కాదనీ.

అప్పటికే ఆయాసంతో నా నరనాడులు కృంగిపోయాయి. దాంతో శత్రుసైనికులు ప్రతిక్షణం నాకు చేరువకాసాగారు. కాస్తో కూస్తో మిగిలిన సత్తువంతా కూడదీసుకుంటూ పరిగెత్తాను.

కాసేపట్లోనే మిగిలిన ఆ సత్తువ కాస్తా నశించిపోయింది. అదే క్షణంలో నా ముందు ఉరకలు వేస్తూ పారుతున్న ఓ నది కనిపించింది. శత్రువులకెలాగూ పట్టుబడక తప్పదు. దానికంటే ఆ నదిలో దూకి కొట్టుకుపోడమే నయమనిపించింది.

దూకేశాను. ఈదే శక్తిలేక మునుగుతూ, తేలుతూ సొమ్మసిల్లి పోయాను. తిరిగి కళ్ళు తెరిచి చూస్తే నదిఒడ్డు కానుకున్న వెడల్పాటి బండపై పడున్నాను. అప్పటికే బాగా పొద్దెక్కింది. నదికిరువైపులా దట్టమైన కీకారణ్యం

లేచాను. ఆకలితో కడుపు కాలుతోంది. అరణ్యంలో తినడానికేమైనా ఫలాలు దొరుకుతాయని కాళ్ళీడ్చుకుంటూ అటు నడిచాను. చెట్లూ పొదలూ చీల్చుకుంటూ కొద్దిదూరం వెళ్ళానో లేదో, ఏదో రివ్వున దూసుకువచ్చి నా పాదాల దగ్గర దిగబడింది భూమిలో. అదిరిపడి చూశాను.

బాణం! చిన్న చిన్న పక్షి ఈకలు చుట్టి వున్న బాణం!

భయంతో చుట్టూ కలయజూశాను. ఎవ్వరూ కనిపించలేదు. మరో అడుగు ముందుకేశాను. మరుక్షణం రెండోపక్కనించి మరో బాణం నా పాంటును రాసుకుంటూ వచ్చి పాదాల ముందు దిగబడింది. వెంట్రుకవాసిలో గురితప్పినా నా పక్కటెముకల్లో దిగబడేదే!

ఇక మూడో అడుగు ముందుకేసే ధైర్యం నాలో అడుగంటింది. చేష్టలుడిగి అలాగే నిల్చుండిపోయాను. అంతలో చుట్టుపక్కల చెట్లమీంచి పదీ, పదిహేనుమంది ఆఫ్రికన్ ఆటవికజాతి నీగ్రోలు కిందికి దూకి, నావైపు ఈటెలూ, బాణాలూ ఎక్కుపెట్టి రాసాగారు.

శిలాప్రతిమలా చూస్తుండిపోయాను వాళ్ళని. అందరూ నన్ను చుట్టుముట్టాక ఒకడు నన్ను తమతో రమ్మన్నట్టు హూంకరించాడు. కదిలాను వారివెంట. చెట్లూ, చేమలూ దాటి చాలాదూరం ప్రయాణించాక, అడవి మధ్య విశాలమైన పచ్చిక మైదానం కనిపించింది. మైదానం మధ్య చిన్న చిన్న గుడిసెలు.

మేమా గుడిసెల్ని సమీపించగానే యువకులూ, యువతులూ, ముసలివారూ, పసిపిల్లలూ బిలబిల బైటికి వచ్చి, నన్ను చూస్తూ పరస్పరం గుసగుసలాడుకో

సాగారు. ఒక విషయం గమనించాను. వారి చూపుల్లో నామీద ద్వేషానికి బదులు యేదో ఆత్మీయ భావన కనిపించింది.

అది నా భ్రమ కాబోలనుకున్నాను. ఐతే, ఓ విశాలమైన గుడిసెలోంచి ఇవతలికి వచ్చిన వృద్ధకాయుడైన వృద్ధుడు నా భ్రమ పటాపంచలు చేశాడు. అతని నడుం చుట్టూ పులి చర్మం వుంది. తలకు పొడవాటి పంచరంగుల పక్షి ఈకలు కట్టి వున్నాయి. చేతిలో లావుపాటి నీలి రంగు పూసల హారం వుంది.

అతను నవ్వుతూ నన్ను సమీపించి, ఆ హారాన్ని నా మెడలో వేసి, ఆప్తమిత్రుడిలా కౌగలించుకున్నాడు. మరుక్షణం నన్ను తీసుకువచ్చిన పురుషులతో సహా అందరూ ఆనందంతో కేరింతలు కొడుతూ, కుప్పిగంతులెయ్యసాగారు. అప్పుడర్థమైంది నాకు, ఆ వృద్ధుడు వారి నాయకుడని.

అతను నా భుజంమీద చెయ్యివేసి, ఆప్యాయంగా తన గుడిసెలోకి తీసికెళ్ళి, ఓ చెక్క దిమ్మమీద కూర్చోబెట్టాడు. మరుక్షణం మట్టిపాత్రల్లో దోరగా కాల్చిన జింకమాంసం, ద్రాక్షరసం, పాలూ, పళ్ళూ తెచ్చి పెట్టారు సేవకులు. సుష్టుగా భోంచేశాను. అప్పుడుగానీ నా ప్రాణం ఓ కొలిక్కి రాలేదు.

అలా వారి ఆతిథ్యంలో మూడు నెలలు గడిచాయి. నాకోసం ఓ ప్రత్యేకమైన గుడిసె తయారుచేసి, అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆ మూడు నెలల వ్యవధిలో నాకు సైగలతో వారి భాష నేర్పడంలో కృతకృత్యులయ్యారు.

రాత్రిళ్ళు నా గుడిసె బైటా పగలు నేను ఎక్కడికి వెళ్ళినా కాపలా వుండేది. ఐతే, అది నిర్బంధ కాపలా కాదు. ఇష్టంవచ్చినట్టు తిరగవచ్చు. కానీ వారి గూడానికి కొద్దిదూరంలో యెత్తయిన మట్టిదిబ్బమీదున్న గుడిసె దగ్గరికి మాత్రం వెళ్ళకూడదని షరతు విధించారు.

ఆ గుడిసెలో యేముందో తెలుసుకోవాలన్న జిజ్ఞాస నన్ను పీకుతుండేది. నా వెంట వుండే ఆటవికుల్ని అడిగితే ఆ రహస్యం చెప్పకూడదని నాయకుడు వారిని ఆదేశించాడట. ఎవ్వరూ చెప్పేవారుకాదు.

ధైర్యంచేసి నేనే వెళ్ళి చూద్దామనిపించేది. అలా తెగిస్తే నా ప్రాణానికే ముప్పురావచ్చు. ఆటవికులు అమాయకులు. స్నేహంచేస్తే ప్రాణం ఇస్తారు. శత్రుత్వం కొనితెచ్చుకుంటే నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. మరో విషయం కూడా నన్ను తికమక పెడుతుండేది. ముక్కూ మొహం తెలీని పరాయివాణ్నయినా నన్ను పట్టుకొచ్చి అంత ఆప్యాయంగా అన్ని రోజుల ఆతిథ్యం యెందుకిస్తున్నారు.

ఆటవికుల్లో కొన్ని భయంకర మూఢవిశ్వాసాలుంటాయనీ, వారి ఇలవేల్పుల రూపంలో కొందరు దేవతలుంటారనీ, ఒక శుభ ఘడియచూసి వారా విగ్రహాలకు మనుషుల్ని బలిస్తారని విన్నాను.

మన పల్లెవాసులిప్పటికీ బలికోసం ప్రత్యేకంగా కొన్ని మేకల్నీ, గొర్రెల్నీ దేవతల పేర పెంచి పోషిస్తారు. జాతరల పేర జరిగే ఉత్సవాల్లో వాటి తలలు తెగనరుకుతారు.

కొంపదీసి, నన్నూ అలా తగిన సమయంకోసం ఆప్యాయంగా పోషించడం లేదుకదా? అన్న అనుమానం పీక

సాగింది. ఐతే, ఆ చుట్టుపక్క లెక్కడా యెటువంటి దేవతా విగ్రహమూ కానరాలేదు నాకు.

ఉండబట్టలేక ఒకరోజు నాయకుణ్ని అడిగేశాను, నన్నక్కడ ఎందుకుంచారని? తగిన సమయం వచ్చాక చెబు తానన్నాడు. చివరికా సమయం రానే వచ్చింది. ఒక రోజు ఉదయం ఫలహారాలయ్యాక, నాయకుడు నన్ను తన గుడిసెకి పిలిపించి సాదరంగా కూర్చోబెట్టాడు.

అతనితో బాటు అక్కడ మరో వ్యక్తికూడా వున్నాడు. అతనే ఆగోసా! పక్క గదిలో చచ్చిపడున్న వృద్ధుడు. అతనా తెగ పూజారి. భూతవైద్యుడు. ఆ ప్రజలు తమ నాయకుని తరవాత అధిక ప్రాధాన్యం ఇచ్చేది అతనికే!

నన్ను చూడగానే అతను లేచి నా దుస్తులన్ని విడి పించి, కాసేపు పడుకోబెట్టి, కూర్చోబెట్టి, వంగోబెట్టి గంటసేపు నా శరీరావయవాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, నాయకుడివైపు చూస్తూ సాలోచనగా తలూపాడు.

అప్పుడు నాయకుడు నన్ను కూర్చోబెట్టి, చెప్పడం ప్రారంభించాడు. 'మిత్రమా! ఆనాడు నువ్వడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చే సమయం ఈ రోజు ఆసన్నమైంది. ఈ కీకారణ్యాల్లో అనేక జాతులూ, తెగలూ నివసి స్తున్నాయి.

అందరికీ తమవంటూ కొన్ని సాంప్రదాయాలూ, నమ్మ కాలూ వున్నాయి. తరతరాలుగా వస్తున్న ఆ సాంప్ర దాయాలను వారు ప్రాణపదంగా కాపాడుకుంటూ జీవి స్తున్నారు. సాధారణంగా ప్రతి తెగకూ తమదంటూ ఓ కులదైవముంటుంది.

ఆ దేవతను వారు విగ్రహరూపంలో ప్రతిష్ఠించుకుని,

బలులూ, పూజలూ జరుపుకుంటారు. అలాగే మాకూ అతి పవిత్రమైన ఓ కులదైవముంది. మువాంగా! ఆమెను మేము జీవంలేని విగ్రహరూపంలో ప్రతిష్టించుకోలేదు. ప్రాణం వున్న మనిషి రూపంలోనే కొలుస్తాము. ఐతే, ఆ మనిషి మా జాతికి చెందినదై వుండదు. వేరు వేరు జాతులకు చెందిన ఇద్దరు స్త్రీ పురుషుల్ని పట్టుకొచ్చి, మా పద్ధతిలో వారికి పెళ్ళి జరిపిస్తాము.

ఆ దంపతులకు పుట్టిన ప్రథమ పుత్రికే మువాంగా తల్లి అవుతుంది. మా జాతికి ఆరాధ్య దైవం! ఆ పిల్లను పూజాపునస్కారాలతో అపురూపంగా పెంచి పెద్ద చేస్తాము. జీవితకాలమంతా ఆమె అవివాహితగానే వుంటుంది.

మరణం అనేది అందరికీ అనివార్యంకదా! వృద్ధాప్యం వచ్చి ఆమె మరణించాక, ఆమె శవాన్ని మా ప్రత్యేక చివరి పూజానంతరం గూడెంమధ్య సమాధిచేసి, మళ్ళీ అదే పద్ధతిలో పరాయి జాతుల స్త్రీ పురుషుల్ని పట్టుకొచ్చి, వివాహం జరిపించి, వారికి పుట్టే తొలి కూతుర్ని మా దేవతగా కొలుస్తాము.

ఆమె మా మధ్య వుంటూ, మా పూజలందుకుంటూ, ఆశీర్వదిస్తున్నంత కాలం మా జాతికే కీడూ వాటిల్లదు. అందరూ సుఖసౌఖ్యాలూ, భోగ భాగ్యాలూ, ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారు.

అడవా, దడవా ఇతర తెగలకూ, మాకూ జరిగే యుద్ధాల్లో అంతిమ విజయం మాదే అవుతుంది. అందుకే ఇతర తెగలేవీ మావైపు కన్నెత్తిచూడవు. ఈ భీకరారణ్యం మధ్య నివసిస్తున్న విషసర్పాలుగానీ, క్రూర మృగాలుగానీ మమ్మల్నేమీ చెయ్యవు.

ముహాంగా తల్లి మాకు దూరమైతే మా పశువులు పాలివ్వడం మానేస్తాయి. పచ్చగా కళకళలాడే మా పొలాలు బీటలు వారతాయి. శత్రువులు మమ్మల్ని చీల్చి చెండాడుతారు. విషసర్పాలూ, క్రూరమృగాలు మా వారిని నిరాటంకంగా బలిగొంటాయి.

అందుకే సాధ్యమైనంత త్వరగా మేము మరో ముహాంగా తల్లిని పుట్టించుకుంటాము. కొద్దిరోజుల క్రితమే ముహాంగా తల్లి మమ్మల్ని విడిచి స్వర్గానికెళ్ళిపోయింది. వెంటనే మేము శ్వేతజాతి స్త్రీ పురుషులకోసం వెతక సాగాము.

అదృష్టవశాత్తూ ఈ మధ్యే మాకో యువతి దొరికింది. ఆమెను గూడానికి దూరంగా వున్న మట్టి దిబ్బమీది గుడిసెలో ఉంచి, కఠినమైన కాపలా యేర్పాటుజేసి, పురుషుడికోసం వెతుకుతుండగా నువ్వు దొరికావు. ఇంత కాలం నీలాగే ఆమెకూ మా స్త్రీలు మా భాషా, ఆచార వ్యవహారాలూ నేర్పారు. ఇక మీ ఇద్దరి వివాహం జరిపించే సమయం ఆసన్నమైంది. ఈ పెళ్ళి నీకిష్టమేనా?”

అతని మాటలు విని, నా మస్తిష్కం పనిచెయ్యడం మానేసింది. చాలా సేపయ్యాక తేరుకుని అడిగాను. “మాకు మొదటి సంతానం ఆడపిల్లే పుడుతుందని ఏమిటి నమ్మకం?”

అందుకతను నవ్వి— “మేము అరణ్య జీవులం! ఈ చెట్టూ చేమల్లో ప్రకృతి యెన్నో చిత్ర విచిత్రాలు నిక్షిప్తం జేసింది. ఆడపిల్ల కావాలనుకున్నప్పుడు ఖచ్చితంగా ఆడపిల్లే పుట్టడానికి కొన్ని వనమూలికలున్నాయి మా వద్ద.

వివాహానికి ముందు మూడు నెలల కాలం ఆ మూలికల్ని

పాలల్లో కలిపి పురుషులు సేవిస్తే వివాహానంతరం వారికి మొదటి సంతానం ఆడపిల్లే పుడుతుంది. ఈ మూడు నెలలూ నీకా మూలికలు తినిపించటానికే సరిపోయింది మరి" అన్నాడు.

"అమ్మాయి పుట్టాక ఆమె తలిదండ్రుల్ని యేం చేస్తారు?" అడిగాను.

"వాళ్ళిష్టం! మాతో బాటు ఇక్కడే ఉండాలనుకుంటే నిక్షేపంగా, సుఖంగా వుండొచ్చు. ఎంతో గౌరవం ఇవ్వబడుతుంది వారికి. వెళ్ళదలచుకుంటే వారి ఇష్టం! యెక్కడికేనా వెళ్ళొచ్చు.

ఐతే, ఎట్టి పరిస్థితిలోనూ వారి వెంట మువాంగా తల్లి పంపబడదు. మా కన్నుగప్పి పిల్లను తీసికెళ్ళారా, ఈ భూనభోంతరాళల్లో ఎక్కడున్నాసరే, మా తల్లిని వెతికి తెచ్చుకుంటాం! అందుకు యెన్ని సంవత్సరాలు పట్టినా వెరకం! ఆ మధ్యకాలంలో ఆమె మరణిస్తే అది వేరే విషయం!

ఆమెను వెదికే పని మా పూజారి అయిన ఈ ఆగోసా స్వయంగా పర్యవేక్షిస్తాడు. మమ్మల్ని మోసం చేసి, మా తల్లిని మాకు దూరం చేసినందుకు శిక్షగా ఆమె తల్లిదండ్రులకు మరణశిక్ష తప్పదు" అన్న అతని మాటలకు నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

ఆ పెళ్ళికి ఒప్పుకోకున్నా నాకు మరణశిక్ష తప్పదేమో! అందుకే, అయిష్టంగానే అందుకు తల ఒగ్గాను. వెంటనే మా పెళ్ళికి ముహూర్తం నిర్ణయించాడు ఆగోసా! వచ్చే పౌర్ణమి రాత్రి!

పగలుకూడా చీకటి కమ్మే ఆ కీకారణ్యాన్ని ఆ రాత్రి పున్నమి జాబిల్లి పండువెన్నెలతో ధగేలుమని

పిస్తోంది. గూడెంవాసులంతా రకరకాల పక్షి ఈకలతో చేసిన దుస్తులు ధరించారు.

నన్నూ అలాంటి దుస్తులతోనే అలంకరించి, మెడలో వజ్రాలహారం వేసి, విశాలమైన మైదానంలోకి తీసికెళ్లారు. తరవాత మేళతాళాలతో ఆ గుడిసెలోంచి ఆడవారి గుంపు బైలుదేరి వచ్చింది. వారిమధ్య వున్న పెళ్ళి కూతుర్ని చూడగానే ఆశ్చర్యంతో అవాక్కయి పోయాను.

ఆమె ఇంగ్లీష్ యువతి! కళ్ళు చెదరగొట్టే అందగత్తె. నాలాగే ఆమె మెడలోనూ ఓ వజ్రాలహారం జిగేల్మంటోంది. దాని కాంతికి ఆ పున్నమి వెన్నెలకూడా వెలవెల బోతోంది.

ఆ నల్లజాతి ఆటవికుల మధ్య ఆసియావాసినైన నన్ను చూడగానే ఆమెకూడా క్షణకాలం చకితురాలైంది. పూజారి ఆగోసా ఆదేశానుసారం, అతను మంత్రాలు వల్లిస్తుండగా, మేళతాళాల మధ్య మేమిద్దరం మా వజ్రాల హారాలు ఒకరి మెడల్లో ఒకరం వేసుకున్నాం!

ఆ తరవాత అర్ధరాత్రి వరకూ డప్పులతో, కేరింతలతో నృత్యాలలో అడవి మార్మోగింది. కాల్చిన జింకమాంసం పళ్ళ మధువుతో విందుచేసుకున్నారు. తరవాత, వివాహిత స్త్రీలు మా ఇద్దర్నీ రకరకాల అరణ్య పుష్పాలతో అలంకరించిన ఆ ఏకాంత గుడిసెలోకి తీసికెళ్ళి, లోనికి తోసి కవాటం మూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

అప్పుడు చెప్పిందా యువతి నా గుండెల్లో తలమార్చి, వెక్కి వెక్కి యేడుస్తూ తన గాథ! విషాద గాథ! బ్రిటన్‌కు చెందిన ఆ యువతి పేరు టీనాచార్లెస్. ఆమె తండ్రి ఏనుగుదంతాల వ్యాపారి. ఏనుగుల్ని వేటాడి,

వాటి దంతాలు సేకరించడానికాయన తరుచూ ఆఫ్రికా అడవులకు వస్తుంటాడు.

ఐతే, ఈసారి కాలేజీ సెలవుల్లో ఆ వేటను కళ్ళారా చూసి ఆనందించాలని తండ్రి యెంత వారించినా వినకుండా ఆయన వెంట ఆఫ్రికా వచ్చింది టీనా! అడవిలో ఏనుగుల్ని వేటాడుతుండగా వారిని ఈ ఆటవికులు చుట్టుముట్టి బాణాల వర్షం కురిపించారు. ఆమె తండ్రీ, ఆయన సహచరులిద్దరూ తుపాకులతో వారిని ఎదుర్కొన్నారు. చెట్లకొమ్మల్లో, పొదల్లో దాగి బాణాలు విడుస్తున్న ఆటవికులకు ఆ తుపాకీ గుళ్ళు తగలకుండా గురితప్పసాగాయి. అలా గుళ్ళన్నీ అయిపోగానే ఆటవికుల బాణాలు ఆమె తండ్రినీ, అనుచరుల్నీ తుదముట్టించాయి.

ఏకాకిగా మిగిలిన ఆమెను వారు గూడానికి తెచ్చి, ఆ గుడిసెలో బంధించారు. ఆ భయంకర వాతావరణంలో ఊహించని విధంగా నాగరిక ప్రపంచానికి చెందిన నేను కనిపించేసరికి ఆమెలో యెక్కడలేని ధైర్యం పుంజుకుంది.

ఆ రాత్రి మా తనువులేకాదు మా మనసులూ యేకమయ్యాయి. రోజులు నిశ్చింతగా దొర్లిపోసాగాయి. ఒకరోజు తనకు నెల తప్పిందని చెప్పింది టీనా! నేనా శుభవార్తను గూడెం నాయకుడికి వెల్లడించాను. అంతే! ఆ రోజు మొదలు మూడురోజులపాటు ఉత్సవాలు జరుపుకున్నారు వాళ్ళు.

ఆనాటినించీ టీనాను కాలు కింద పెట్టనివ్వకుండా యెంతో అపురూపంగా చూసుకోసాగారు అక్కడి స్త్రీలు. తొమ్మిది మాసాల తరవాత పండంటి ఆడపిల్లను ప్రసవించిందామె.

వరసగా మూడు వారాలూ వేడుకలు జరిగాయి గూడెంలో. ఆనాటినించీ మా గౌరవమర్యాదలు ఇంకా ఇనుమడించాయి. మా చిట్టితల్లికి శ్రీవిద్య అని పేరు పెట్టుకున్నాను. వారు మాత్రం మువాంగా అనే పిల్చేవారు.

ఆ లేత వయసునించే ఆమెకు పూజాపునస్కారాలు ప్రారంభమయ్యాయి. మాలో భ రిం ప రా ని దిగులు ప్రారంభమైంది. మా ప్రేమ ఫలాన్ని, పంచప్రాణాన్ని, జీవితాంతం అవివాహితగా, ఆ ఆటవికుల మూఢవిశ్వాసాలకు బలిపెట్టాలా?

అసంభవం! నాకు తినబెట్టిన మూలికల ప్రభావంవల్ల మళ్ళీ నాకు సంతానం కలగదనికూడా చెప్పారాయె. ఏం చెయ్యాలి? తీవ్రంగా యోచించి ఓ నిర్ణయానికి వచ్చాం! పారిపోవాలి! ఆలోచించినంత సామాన్య విషయం కాదది.

తగిన సమయం కోసం యెదురుచూడసాగాం! అలా రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి కాలగర్భంలో. ప్రతి సంవత్సరం మా బిడ్డ పుట్టిన రోజును ఎంతో పవిత్ర దినంగా భావించి, వైభవంగా పండగ జేసుకునేవారు వాళ్ళు. అనేక వజ్రవైఢూర్యాలను పిల్లకు కానుకలుగా సమర్పించేవారు.

ఆలోగా వారికి మామీద పూర్తి విశ్వాసం ఏర్పడింది. ఆ విశ్వాసాన్ని ఆధారం చేసుకుని, వజ్రవైఢూర్యాలన్నీ మూటగట్టుకుని, ఓ అర్ధరాత్రి పాపతో అక్కణ్ణించి పారిపోయాం! అష్టకష్టాలుపడి ఓ నగరాన్ని చేరుకో గలిగాం!

అప్పటికి యుద్ధం ముగిసింది. ప్రపంచంలో నూతన

మార్పు వచ్చింది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. దక్షిణాఫ్రికా ప్రభుత్వ సహకారంతో మేము క్షేమంగా భారతదేశం చేరుకున్నాం!

టీనా మన పౌరసత్వాన్నీ, హిందూమతాన్ని స్వీకరించి, ఆదర్శపత్నిగా సంసారం చెయ్యసాగింది. శ్రీవిద్య పదేళ్ళ ప్రాయంలో వుండగా టీనాకు కాన్సర్ సోకి, అనేక ఇక్కట్లుపడి కన్నుమూసింది.

• • •

"ఈ లోకంలో ఇక నాకు మిగిలింది నా కూతురే! అలాంటి నా పంచప్రాణాన్ని వెదుక్కుంటూ ఇన్నేళ్ళ తరవాత ఇక్కడికి చేరుకున్నారు వీళ్ళు. ఎంత నచ్చచెప్పినా వినకుండా బలవంతంగా నా తల్లిని నానుండి దూరం చెయ్యడానికి పూనుకున్నారు. గత్యంతరం లేక చివరికి వాళ్ళను చంపక తప్పలేదు.

చట్టరీత్యా అది నేరం కాకపోవచ్చు. నేను నిరపరాధినే కావచ్చు. కానీ, నైతిక దృష్ట్యా నేను మహాపరాధిని ఇన్‌స్పెక్టర్. క్షమింపరాని నేరస్థుణ్ణి! అమాయకులైన వారిని నమ్మించి, వంచించి, భవబంధాలను వదులుకోలేక, పారిపోయి వచ్చిన ద్రోహిని.

నమ్మిన ఆచారాలను విస్మరించక, తుదకు తమ ప్రాణాలనే తృణప్రాయంగా ఎంచిన వారు నిజంగా మహనీయులు! పునీతులు!" అంటూ ముగించాడు మేజర్ నాయుడు.

స్పృహ వచ్చి, అంతవరకూ తండ్రి చెప్పిన కథ విన్న శ్రీవిద్య హృదయం చలించి చేతుల్లో ముఖం కప్పుకుని ఏడవసాగింది వెక్కి వెక్కి.

—: అయిపోయింది :—